సంపుటి :02 సంచిక :167 పేజీలు :07 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

సోమవారం 25, ఆగస్టు 2025

## ఏసీబీకి చిక్కిన ఏడీఏ

- జీరో దందాపై చర్యలు లేకుండా ఉండేందుకు రూ.25 వేల లంచం డిమాండ్
- సొమ్ము తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కిన అధికారి
- భద్రాద్రి జిల్లాలో ఘటన

06






## మట్టి వినాయకులను పూజిద్దాం

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- కాలుష్య నియంత్రణ శాఖ పోస్టర్ల ఆవిష్కరణ
- కలెక్టరేట్ లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ

05



# జ్వరం.. కలవరం

### 'ఉమ్మడి వరంగల్'లో విషజ్వరాలు

- వరుసగా కురిసిన వానల ప్రభావం
- చెత్త, నీరు పేరుకుని పెరిగిన దోమలు
- గుండ్రపల్లి, తొర్రూరు, కోయవీరాపురంలో మూడు మరణాలు
- ఆందోళన కలిగిస్తున్న డెంగీ, మలేరియా కేసులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యనిపుణులు
- జ్వర లక్షణాలుంటే ఆస్పత్రికి వెళ్లాలని సూచన

02

ఉమ్మడి వరంగల్ జిల్లాలో డెంగీతో పాటు ఇతర విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వరుసగా పదిరోజుల పాటు వానలు కురవడం, వీధులు, రోడ్డు పక్కన చెత్త పేరుక పోవడం, దానిని సకాలంలో తొలగించకపోవడంతో దోమలు పుట్టుకొచ్చి, అవి జనాలను కుట్టడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని సామాన్యజనం పేర్కొం టున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు పేరుకుపోవడం, వాటిలో దోమల లార్వాలు వృద్ధి, అయి తర్వాత దోమలు మారి జనాలను కుడుతుండటం వల్ల విషజ్వరాలు ప్రబలుతున్నయని వైద్యనిపుణులు చెప్తున్నారు. వరంగల్ జిల్లాలో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది. ఒక గ్రామంలో కనీసం పది విష జ్వరాల కేసులైనా నమోదవుతున్నాయి. అనారోగ్యం బారిన పడిన వారంతా జలుబు, ఒళ్లు నొప్పులతో ఆస్పత్రికి పరుగులు తీస్తున్నారు. వర్ధన్నపేట, రాయపర్తి, చెన్నారావుపేట, రంగాశాయిపేట, కాశీబుగ్గ, దేశాయిపేట, పర్వతగిరి, గిర్మాజీపేట, నల్లబెల్లి ప్రాంతాల్లో ఎక్కువగా విషజ్వరాల కేసులు నమోదవుతున్నాయి.

- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

## భార్యను చంపిన భర్త

పెళ్లైన మూడు నెలలకే దారుణ హత్య

05













## ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా లక్ష్మణ్

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాధవిలత

02



# వర్ధన్నపేటలో జనహిత యాత్ర

- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్, కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి
- అంబేద్కర్ సెంటర్ వద్ద కార్నర్ మీటింగ్

06

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ చేపట్టిన జనహిత యాత్రకు వరంగల్ జిల్లాలో ఘన స్వాగతం లభించింది. సోమవారం వర్ధన్నపేట శివారులోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ నుంచి మొదలైన పాదయాత్ర అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని, సామాజిక న్యాయం ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. తమ పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని పేర్కొన్నారు. ఈ యాత్రలో రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- అక్షరదర్బార్, వర్ధన్నపేట:

# ప్రభాకర్ రావు బెయిల్ పిటిషన్ వాయిదా

## - దర్యాప్తునకు సహకరించాలని సుప్రీం కోర్టు ఆదేశం

అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది. దర్యాప్తునకు సహకరించడం లేదని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదనలపై న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. విచారణ సందర్భంగా రాష్ట్రప్రభుత్వం తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తమ వాదనలు వినిపిస్తూ.. ప్రభాకర్‌రావు దర్యాప్తునకు సహకరించడం లేదని, ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన ల్యాప్‌టాప్‌తో పాటు, ఆయన సమర్పించిన ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను ఫార్మాట్ చేసి, అందులో ఎలాంటి డేటా లేకుండా ఇచ్చారని కోర్టుకు వివరించారు. మరోవైపు, ప్రభాకర్‌రావు తరపు న్యాయవాది శేషాద్రి నాయుడు తమ పిటిషనర్ దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నారని, ఎన్నిసార్లు పిలిచినా హాజరవుతున్నారని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం.. దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ప్రభాకర్రావును ఆదేశిస్తూ తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. దర్యాప్తునకు సంబంధించి స్టేటస్ రిపోర్టును సమర్పించడానికి ప్రభుత్వానికి గడువు ఇచ్చింది.

### ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం

# గౌరవ అధ్యక్షుడిగా లక్ష్మణ్

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాధవీలత

అక్షరదర్బార్, హనుమకొండ: తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఉమ్మడి వరంగల్ జీలాకు  చెందిన తిప్పారపు లక్ష్మణ్ మాదిగ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్ లో తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగుల సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన కార్పొరేషన్ ఉద్యోగులు లక్ష్మణ్ ను ఏకగ్రీగంగా ఎన్నుకున్నారు. మూడు దశబ్దాలుగా అనేక దళిత, తెలంగాణ ఆవిర్భావ ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర పోషించడంతో ఆయన్ను తమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కే బాబు మోజెస్ తెలిపారు. జనగామ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవిలతను తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షుడిగా తిప్పారపు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాధవిలత  ఏకగ్రీవ ఎన్నిక పట్ల ఉమ్మడి వరంగల్ జిల్లా దళిత సంఘాలతో పాటు ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.





# జ్వరం.. కలవరం

## ఉమ్మడి వరంగల్ జిల్లాలో విజృంభిస్తున్న విషజ్వరాలు

- వరుసగా కురిసిన వానల ప్రభావం
- చెత్త, నీరు పేరుకుని పెరిగిన దోమలు
- గుండ్రపల్లి, తొర్రూరు, కోయవీరాపురంలో మూడు మరణాలు
- ఆందోళన కలిగిస్తున్న డెంగీ, మలేరియా కేసులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యనిపుణులు
- జ్వర లక్షణాలుంటే ఆస్పత్రికి వెళ్లాలని సూచన

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో డెంగీతో పాటు ఇతర విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వరుసగా పదిరోజుల పాటు వానలు కురవడం, వీధులు, రోడ్డు పక్కన చెత్త పేరుకపోవడం, దానిని సకాలంలో తొలగించకపోవడంతో దోమలు పుట్టుకొచ్చి, అవి జనాలను కుట్టడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని సామాన్యజనం పేర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు పేరుకుపోవడం, వాటిలో దోమల లార్వాలు వృద్ధి, అయి తర్వాత దోమలు మారి జనాలను కుడుతుండటం వల్ల విషజ్వరాలు ప్రబలుతున్నయని వైద్యనిపుణులు చెప్తున్నారు. వరంగల్ జిల్లాలో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉంది. ఒక గ్రామంలో కనీసం పది విష జ్వరాల కేసులైనా నమోదవుతున్నాయి. అనారోగ్యం బారిన పడిన వారంతా జలుబు, ఒళ్లు నొప్పులతో ఆస్పత్రికి పరుగులు తీస్తున్నారు. వర్ధన్నపేట, రాయపర్తి, చెన్నారావుపేట, రంగాశాయిపేట, కాశీబుగ్గ, దేశాయిపేట, పర్వతగిరి, గిర్మాజీపేట, నల్లబెల్లి ప్రాంతాల్లో ఎక్కువగా విషజ్వరాల కేసులు నమోదవుతున్నాయి.

### - పీహెచ్ సీలో కేసులు..

వరంగల్ జిల్లాలో ఈ నెల 20 వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్సీ)ల్లో నమోదైన గణాంకాల ప్రకారం.. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 వేల ఓపీ నమోదుకాగా, వీరు 300 మంది విష జ్వరాల బారిన పడ్డారు. వీటిలో 18 కేసులు డెంగీనే కావడం గమనార్హం. వీరిలో ఒక బాధితుడు మలేరియాతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం విషజ్వరాలు ఇంతకంతకు పెరుగుతున్నవని వైద్యులు వెల్లడిస్తున్నారు. అనధికారికంగా, ఇంకా తేలని డెంగీ కేసులు జిల్లాలో 6వేలకు పైగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

### - ఎంజీఎం ఆస్పత్రిలో డెంగీ కేసుల కలకలం..

వరంగల్లోని ఎంజీఎం ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న వైద్య సిబ్బంది కూడా విషజ్వరాల బారిన పడుతున్నారు. ఇటీవల కాకతీయ మెడికల్ కాలేజీలో పీజీ చదువుతున్న ఓ పీజీ విద్యార్థిని డెంగీ బారిన పడింది. అలాగే మరో ఇద్దరు విద్యార్థినులు కూడా డెంగీ బారిన పడ్డారు. వైద్యులు, సిబ్బంది సైతం విష జ్వరాల బారిన పడటం కలకలం రేపింది. ఆస్పత్రిలో చెత్తాచెదారం పేరుకుపోవడం వల్లే ఈ పరిస్థితి అని వైద్యసిబ్బంది, ఔట్ సోర్సింగ్ కార్మికులు పేర్కొంటున్నారు. మరోవైపు ఎంజీఎం ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ వస్తున్నది.  ఈనెల 20 వరకు సుమారు 300 మంది విషజ్వరాలతో ఆస్పత్రికి రావడం ఆందోళన కలిగిస్తున్నది. రోగుల్లో 54 మంది డెంగీతో బాధపడుతున్న వారు కాగా, మరో 11 మంది డెంగీతో బాధపడుతున్నారు.

### - ప్రైవేటు ఆస్పత్రులు కిటకిట..

విషజ్వరాల బారిన పడి ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చేవారి సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. ఇటీవల ఓ వ్యక్తి డెంగీ బారిన పడగా, అతడికి చికిత్స అందించిన ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం రూ.లక్షలన్నర బిల్లు వేసింది. దీంతో బాధిత కుటుంబం అప్పోసప్పో చేసి, బిల్లు కట్టారు. చివరకు ప్రాణాలైతే దక్కాయని బాధితుడిని ఇంటికి తీసుకెళ్లారు.

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లికి చెందిన వ్యవసాయ కూలి దంపతుల కుమార్తె ఐదేళ్ల పాప షేక్ మెహరీన్ ఇటీవల విషజ్వరం బారినపడింది. పరిసితి విషమించడంతో పాపను నర్సంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు చేతులెత్తేయడంతో వరంగల్లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పాప మృతిచెందింది.

మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన సాత్విక అనే బాలిక ఇటీవల జ్వరం బారిన పడింది. తల్లిదండ్రులు ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించగా తగ్గలేదు. దీంతో ఆమెను వరంగల్లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగా బాలిక మృతిచెందింది. డెంగీతో బాధపడుతూ పరిస్థితి విషమించి ఆమె మృతిచెందిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ములుగు జిల్లా వాజేడు మండలం కోయవీరాపురానికి చెందిన ఉయిక దీపిక అనే యువతి ఇటీవల డెంగీ లక్షణాలతో బాధపడింది. ఎంతకీ జ్వరం, ఒళ్లు నొప్పులు తగ్గకపోవడంతో తల్లిదండ్రులు ఆమెను ఏటూరు నాగారంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆరోగ్యం విషమించడంతో వరంగల్కు తరలించారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా మృతిచెందింది.

### - విష జ్వరాల లక్షణాలు..

సాధారణ విష జ్వరాలు ఎక్కువగా వైరస్ లేదా బాక్టీరియా వల్ల వస్తాయి. వీటిని సరిగా గమనించకపోతే ప్రమాదకరంగా మారవచ్చు. విషజ్వరాల బారిన పడిన వారు తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, జ్వరంతో బాధపడతారు. వారిలో ఆకలి మందగిస్తుంది. నీరసం ఆవహిస్తుంది. గొంతు నొప్పి, దగ్గు వేధిస్తాయి.

### - డెంగీ లక్షణాలు..

డెంగీ 'ఎడిస్ ఈజిప్టె' అనే దోమ కాటు ద్వారా వ్యాపిస్తోంది. డెంగీ సోకిన వారు తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనక నొప్పితో బాధపడతారు. శరీరంపై ఎర్రటి దద్దుర్లు వస్తాయి. కీళ్లు, కండరాల నొప్పి, వికారం, వాంతులతో ఇబ్బందిపడతారు. కొన్ని సందర్భాల్లో చిగుళ్లు, ముక్కు నుంచి రక్తం కూడా కారుతుంది.

### - మలేరియా లక్షణాలు..

మలేరియా 'అనాఫిలిస్' అనే దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది. దీనివల్ల కాలేయం, మెదడు వంటి అవయవాలపై ప్రభావం పడుతుంది. మలేరియా లక్షణాలు వస్తూ, పోతూ ఉంటాయి. ఎక్కువగా చలితో కూడిన జ్వరం వస్తుంది. తీవ్రమైన తలనొప్పి వేధిస్తుంది. వాంతులు వస్తాయి. విపరీతంగా చెమట పడతాయి. కండరాల నొప్పులుంటాయి.

### - తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విషజ్వరాలకు కారణం దోమల ద్వారా వ్యాపించే వైరస్‌లు, బాక్టీరియాలు. ఈ వ్యాధులు రాకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మీ ఇంటి చుట్టూ, ఇంట్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోండి. ఎందుకంటే, నిల్వ ఉన్న నీటిలో దోమలు ఎక్కువగా గుడ్లు పెడతాయి. టైర్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండలు, పాత ప్లాస్టిక్ డబ్బాల్లో నీరు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయండి. ఇళ్లలో వాడే కూలర్లు, పూలకుండీలు, ఇతర పాత్రలలోని నీటిని తరచుగా మార్చండి. ఇంటి కిటికీలకు, తలుపులకు దోమలు లోపలికి రాకుండా ఉండేలా జాలీలు లేదా నెట్లను ఏర్పాటు చేసుకోండి. రాత్రి పూట దోమతెరలను వాడడం చాలా ముఖ్యం. దీనివల్ల దోమల నుంచి రక్షణ పొందవచ్చు. దోమల నివారణకు వీలైనంత వరకు సహజ పద్ధతులను పాటించండి. ఉదాహరణకు, వేపనూనె దీపం వెలిగించడం. దోమలు ఎక్కువగా ఉన్న చోట ఉండకుండా చూసుకోండి. మంచి ఆరోగ్యానికి, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోండి. విటమిన్–సి ఎక్కువగా ఉన్న పండ్లు, కూరగాయలు తినండి. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగండి. బయట ఆహారం తినడం తగ్గించండి.

# యూరియా కోసం తిప్పలు...
# క్యూలో చెప్పులు!

అక్షర దర్బార్, మల్హర్ : మండలంలో వానాకాలం మొదలైనప్పటి నుంచి రైతులకు యూరియా కోసం ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం తాడిచెర్ల పాక్స్ కార్యాలయానికి 444 బస్తాల యూరియా చేరింది. అయితే స్టాక్ తక్కువగా, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో రైతులు ఉదయం 8 గంటలకే వరుస కట్టారు. 10 గంటలు దాటినా పంపిణీ ప్రారంభం కాక పోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెప్పులను




క్యూలో పెట్టి ఎడ్లబండ్లు, వాహనాలతో వేచి కూర్చున్నారు. అనంతరం అధికారులు పంపిణీ చేపట్టారు. యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫల మైందని మల్లారం, పెద్దతూండ్ల, చిన్నతూండ్ల, కొండంపేట, వళ్లెంకుంట, దుబ్బపేట గ్రామాల రైతులు మండిపడ్డారు.



# సివిల్ సప్లయిస్ ఎం ఎల్ ఎస్ పాయింట్ ఇన్చార్జిగా ప్రేమ్ కుమార్

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల పౌర సరఫరాల శాఖ ఎం.ఎల్.ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జిగా జూనియర్ అసిస్టెంట్ బందెల ప్రేమ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పనిచేసిన అసిస్టెంట్ గ్రేడ్-1 గంగాధరి రాజు బదిలీపై హనుమకొండకు వెళ్లగా, ఆయన స్థానంలో ప్రేమ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు.





# కన్నుల పండువగా పడిపూజ

## ఉత్తర నక్షత్రం సందర్భంగా అయ్యప్ప స్వామికి అభిషేకాలు

అక్షర దర్బార్, నర్సంపేట: పట్టణంలోని శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం మహాదివ్య పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్తర నక్షత్ర జాతకంతో జన్మించిన అయ్యప్పస్వామి సందర్భంలో ప్రతి నెల ప్రత్యేక పడిపూజలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ సింగిరికొండ మాధవశంకర్ గుప్తా, అధ్యక్షుడు సైపా సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో హోమం, కలశపూజలు, అష్టాభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రోచ్చారణల మధ్య మహాభిషేకాలు జరిపారు.



భజన బృందాల కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగగా, అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది కార్యక్రమంలో దేవాలయ ట్రస్టు కోశాధికారి దొడ్డ రవీందర్ గుప్తా,దోమకుంట్ల నందయ్య గురుస్వామి, శ్రీరాం ఈశ్వరయ్య ఇరుకుల్ల వీరలింగం, భూపతి లక్ష్మీనారాయణ,బండారుపల్లి చెంచారావు, పాలకుర్తి శ్రీనివాస్, గంధం నరేందర్, వజినపెల్లి శ్రీనివాస్, దొడ్డ వేణు, అనంతుల రాంనారాయణ, మల్యాల రాజు, మల్యాల ప్రవీణ్, శ్రీరాం కిరణ్, బాదం అనిల్ , తుమ్మలపెల్లి సురేందర్, బాదం రంజిత్,మాలే రాజేష్,మాలె సరేష్,దొడ్డ మనోహర్, సైపా రవి, రాంచందర్, కర్ణాకర్,శ్రీనివాస్, బండారి శ్రావణ్, వంగేటి గోవర్ధన్, మద్దేనపేల్లి సత్యనారాయణ, పబ్బా శ్రీనివాస్,ఆకుల ప్రభాకర్, బిట్స్ స్కూల్ ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్, కాకతీయ గ్రాడ్యుయేట్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవరెడ్డి ఫిట్నెస్ గ్రూప్ అసోసియేషన్ సభ్యులు వంగాల ప్రేమ్ సాగర్ రెడ్డి, గురుస్వాములు సంజీవ రావు,బొట్ల నాగరాజు, యాదగిరి,అనిల్,గంగిశెట్టి శ్రీనివాస్,ఆలయ గుమస్తా దేశి రాము అర్చకులు ఫ్రాన్స్,శివాంకిత్,ఆనంద్,తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

## -బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి

అక్షర దర్బార్, పరకాల: పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు నడికూడ మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పులిగిల్ల, రాయపర్తి గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దురిశెట్టి చంద్రమౌళి (చందు) మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను సోషల్ మీడియాలో బహిర్గతం చేస్తూ, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మేడిపల్లి శోభన్, సమన్వయ కమిటీ సభ్యులు చందా కుమారస్వామి, నందికొండ జైపాల్ రెడ్డి, మచ్చ రవీందర్, బీముడి నాగిరెడ్డి, మండల యువజన నాయకులు ముస్కే రాము, సురాబు శ్రీకాంత్, గుడికందుల శివ, రాయపర్తి గ్రామ కమిటీ అధ్యక్షులు పోశాల బిక్షపతి, పులిగిల్ల గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి అల్లే మహేందర్ పాల్గొన్నారు.



# పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

## -తెగులు నివారణపై రైతులకు సూచనలు

అక్షర దర్బార్, పరకాల : పరకాల, శాయంపేట, ఆత్మకూర్, దామెర మండలాలలో ప్రత్తి, కంది, వరి, మొక్కజొన్న పంటలను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం వరంగల్‌కు చెందిన శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్తి పంటలో టొబాకో స్ట్రీక్ వైరస్ (తలమడు తెగులు) వ్యాప్తికి కారణమయ్యే తామర పురుగులు, పేను బంక కనిపించాయని తెలిపారు. దీని నివారణకు ఇమిడాక్లోపరిడ్ (5 ml) లేదా తయామితాక్సమ్ (0.2 ml) లేదా పిప్రోనిల్ (2 ml) ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే కంది పంటలో గొడ్డు మోతు తెగులు కనిపించాయని, నివారణకు నీటిలో కరిగే గంధకం (3 g) ఒక్క లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. రాములు, డా. గోనియా నాయక్, డా. పద్మజ, డా. మధు, పరకాల ఏడీఏ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారులు ఈ.యాదగిరి, గంగా జమున, విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# 'బాలాజీ'లో మట్టి గణపతుల ప్రదర్శన

అక్షర దర్బార్, నర్సంపేట : లక్నపల్లిలోని బాలాజీ టెక్నో స్కూల్‌లో విద్యార్థులు పర్యావరణహిత మట్టి గణపతులను తయారు చేసి ప్రదర్శించారు. వినాయక చవితి సందర్భంగా విద్యార్థులచే 400 మట్టి వినాయక విగ్రహాలు రూపొందించబడ్డాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల నీటి వనరులు కాలుష్యానికి గురవుతున్నాయని, పర్యావరణానికి నష్టం కలుగుతుందని తెలిపారు. మట్టి వినాయకులను పూజించడం శుభప్రదమని, పర్యావరణాన్ని కాపాడే మార్గమని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రియాజుద్దీన్, ప్రదీప్, క్రాంతికుమార్,



భవాని చందు, రమేష్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ హబ్ లో పరిశ్రమలు నెలకొల్పాలి

- పెట్టుబడిదారులు ముందుకు రావాలి
- భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సార్

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం మైలారం గుట్టల్లో అభివృద్ధి చెందుతున్న 187 ఎకరాల ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమలు స్థాపించేందుకు పెట్టుబడిదారులు ముందుకు రావాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పిలుపునిచ్చారు. సోమవారం రెవెన్యూ, పరిశ్రమల శాఖ, పోలీసు అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, భూమి దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని, పారిశ్రామిక, విద్యా, పర్యాటక హబ్‌గా మైలారం ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇండస్ట్రియల్ పార్క్ కోసం 60 ఎకరాల్లో 197 ప్లాట్లు కేటాయించగా, త్వరలో స్క్వేర్ ఫీట్ రూ.1600 లకు టెండర్లు విడుదల చేస్తామని చెప్పారు. అదనంగా



ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్‌కు 40 ఎకరాలు, కేంద్రీయ విద్యాలయంకు 10 ఎకరాలు, సైనిక్ స్కూల్‌కు 20 ఎకరాలు, మార్కెట్ యార్డ్‌కు 15 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. రోడ్డు పనులకు ఇప్పటివరకు రూ.4 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.15 కోట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, అధికారులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

**–రాణా ప్రతాప్ రెడ్డి**



అక్షర దర్బార్, నల్లబెల్లి : దేశ అభివృద్ధి గ్రామాల అభివృద్ధితోనే సాధ్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం నల్లబెల్లి మండల పార్టీ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి పథంలో బీజేపీ మాత్రమే గ్రామాలను ముందుకు నడిపించగలదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రేలకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ వార్డు మెంబర్ పోరిక అనిల్, భూక్యా ప్రభాకర్, వాంకుడోత్ రాజేష్, కాంగ్రెస్ సీనియర్ నేతలు బొజ్జం బిక్షపతి, ఎల్లబోయిన సంతోష్ బీజేపీలో చేరారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కరించాలి

**కలెక్టర్ రాహుల్ శర్మ**



అక్షర దర్బార్, భూపాలపల్లి : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 53 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శాఖ అధికారి తన శాఖకు సంబంధించిన వినతులను ప్రాధాన్యతగా తీసుకుని, నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీవో రవి పాల్గొన్నారు.





## రంగాపురంలో 'పొలంబాట'

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: భూపాలపల్లి నియోజకవర్గం మొగుళ్ళపల్లి మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం "పొలం బాట" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది రైతులకు కేపాసిటర్ల ప్రాముఖ్యత, విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మోటార్లు నడిపేటప్పుడు భద్రతా చర్యల గురించి అవగాహన కల్పించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో వినియోగదారులు 1912 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఈ పాపిరెడ్డి ఇన్చార్జి ఏఈ సంజయ్ లైన్మెన్ అనిల్ ఏఎల్ఎం మహిపాల్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు,

## తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



అక్షర దర్బార్, కేసముద్రం : అనారోగ్యంతో మృతిచెందిన తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన సోమవారం తాళ్ళపూసపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామానికి చెందిన తూళ్ళ ఐలయ్య (60) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు భార్య పూలమ్మ, ముగ్గురు కుమార్తెలు మహేశ్వరి, స్రవంతి, ప్రియాంక ఉన్నారు. కుమారుడు లేకపోవడంతో పెద్ద కుమార్తె మహేశ్వరి తండ్రికి తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది.

# ఆరు గ్యారంటీలు నెరవేర్చాలి

**భూపాలపల్లి నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి**



అక్షర దర్బార్, చిట్యాల : కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని భూపాలపల్లి నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జ్ చందుపట్ల కీర్తి రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం చిట్యాలలో బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కీర్తి రెడ్డి మాట్లాడుతూ – ICDS కార్యాలయాన్ని తిరిగి చిట్యాలలో ఏర్పాటు చేయాలని, నాపాక ఆలయానికి నిధులు కేటాయించాలని, రైతులకు పట్టాలు ఇవ్వాలని, డిగ్రీ కాలేజ్, ITI ఏర్పాటు చేయాలని, ఆసుపత్రిలో వైద్యులను నియమించాలని, చిట్యాలను రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరారు. అభివృద్ధి పేరుతో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ వాస్తవ పరిస్థితి చూపించాలని సవాల్ విసిరారు. సమస్యలు పరిష్కరించకపోతే బీజేపీ ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిశిధర్ రెడ్డి, వెన్నంపల్లి పాపయ్య, నాగపురి రాజమౌళి గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలి

**బీఆర్ఎస్ పరకాల మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి**



అక్షర దర్బార్, పరకాల : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని ఓడించాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతి రెడ్డి మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు మలకపేట, వేల్లంపల్లి గ్రామాల్లో బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలోనే పరకాల అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమైందని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను భయపెడుతూ, వసూళ్ల దందా చేస్తున్నారని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి భారీ మెజార్టీతో బిఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతాని శ్రీనివాస్ రెడ్డి, గుర్జపెల్లి ప్రకాష్ రావు, మాజీ జడ్పీటీసీ చిలువేరు మొగిలి, గుండె బోయిని నాగయ్య, గంట సమిరెడ్డి, ఆముదాలపెల్లి అశోక్, కోరే రమేష్, శాతరాసి సనత్‌కుమార్, ఎరుకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలను లెక్కచేయని మున్సిపల్ అధికారులు

**కేసముద్రం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ నేతల ధర్నా**

అక్షర దర్బార్, కేసముద్రం: పారిశుధ్యం పై నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలను లెక్క చేయకుండా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారని సిపిఐ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్, ఏఐటియుసి మండల కార్యదర్శి మంద భాస్కర్ తీవ్రంగా విమర్శించారు. సోమవారం కేసముద్రం మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడి అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఆశపడ్డా సమస్యలే పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినా అధికారులు విస్మరిస్తున్నారని ఆరోపించారు. దోమల నివారణకై ఫాగింగ్, పారిశుధ్యం పై ప్రత్యేక డ్రైవ్, వాటర్ ట్యాంకుల శుభ్రపరచడంలో అధికారులు విఫలమవడంతో ప్రజలు మురికి నీరు, వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కాసు సాయి చరణ్, ఎస్కే ఇమామ్, వడ్డెబోయిన లక్ష్మీనరసయ్య, భూక్య శ్రీను, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



గిర్నిబావిలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు

## అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలి

**బీఆర్ఎస్ దుగ్గొండి మండల అధ్యక్షుడు సుకినే రాజేశ్వర్ రావు**

అక్షర దర్బార్, దుగ్గొండి : రైతులకు సకాలంలో యూరియా ఎరువులు అందించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సుకినే రాజేశ్వరరావు విమర్శించారు. సోమవారం గిర్ని బావిబావి సెంటర్లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు సరిపడా ఎరువులు అందించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను వంచించి ఇబ్బందులకు గురి చేస్తోంది" అన్నారు. నియోజకవర్గంలో వ్యవసాయ శాఖపై సమీక్షలు జరపకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. రైతులకు యూరియా అందే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస, మాజీ ఎంపీపీ కౌమల భద్రయ్య, క్లస్టర్ ఇంచార్జిలు, మాజీ సర్పంచులు, గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనహిత పాదయాత్రకు తరలిన కాంగ్రెస్ నాయకులు

అక్షర దర్బార్, శాయంపేట: ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలనే ఉద్దేశంతో వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో నిర్వహిస్తున్న రెండవ విడత జనహిత పాదయాత్రలో శాయంపేట మండల కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో వెళ్ళిన ఈ బృందంలో మారపల్లి రవీందర్, వైనాల కుమారస్వామి, చింతల రవిపాల్, శానం కుమారస్వామి, మారపల్లి వరదరాజు, కట్టయ్య, పల్లెబోయిన శ్రీనివాస్, జగన్, తక్కల్ల



సాంబయ్య, కుమారస్వామి తదితరులు ఉన్నారు. ఈ పాదయాత్రలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పాల్గొననున్నారు.



# పరకాల అభివృద్ధి ఎమ్మెల్యే లక్ష్యం


అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణాన్ని వ్యాపార, వాణిజ్య, విద్యా, వైద్య రంగాలలో ముందుకు తీసుకెళ్లడం ఎమ్మెల్యే రేవురి ప్రకాష్ రెడ్డి ఏకైక లక్ష్యమని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో చందుపట్ల రాజిరెడ్డి, సోధా అనిత రామకృష్ణ, ఎండి రంజాన్ అలీ, మెరుగు శ్రీశైలం గౌడ్, మడికొండ సంపత్, ఎర్రబెల్లి భాస్కర్ రెడ్డి, పావుశెట్టి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



# మట్టి వినాయకులను పూజిద్దాం

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- కాలుష్య నియంత్రణ శాఖ పోస్టర్ల ఆవిష్కరణ
- కలెక్టరేట్ లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ

అక్షరదర్బార్, హనుమకొండ: వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, రసాయనాల వినియోగం వల్ల జల వనరులు, కాలుష్యానికి గురవుతాయని, అందుచేత కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలను మానివేసి మట్టితో చేసిన విగ్రహాలను పూజించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణం పట్ల ప్రజల్ని చైతన్యపరిచే విధంగా గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మట్టి గణపతులను ప్రతిష్టించి పూజిద్దాం అనే నినాదంతో రూపొందించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాల పంపిణీని కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ప్రారంబించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షించాలని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రతి జిల్లాకు 2 వేల మట్టి విగ్రహాలను



ఉచితంగా పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణ కృషి చేయాలని చెరువులను కలుషితం కాకుండా కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సునీత, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# సివిల్ సప్లయ్ గోదాం ఇన్చార్జీ గంగాధర్ రాజుకు ఘన వీడ్కోలు

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల సివిల్ సప్లై గోదాం ఇన్చార్జ్‌గా ఎనిమిది సంవత్సరాలు సేవలందించిన గంగాధర్ రాజును బదిలీపై వెళ్తుండగా సోమవారం హమాలీలు, గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. 176 రేషన్ షాపులకు, 7 మండలాలకు సకాలంలో బియ్యం సరఫరా చేసి కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా "ఉత్తమ ఉద్యోగి" అవార్డు అందుకున్న ఆయనను విడిచిపెట్టడం బాధాకరమని హమాలీలు భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం శాలువాతో సత్కరించి వీడ్కోలు తెలిపారు. కార్యక్రమంలో హమాలి మేస్త్రి సరిగోమ్ముల సురేష్, బండారి మధుకర్, కట్కూరి కుమార్, శీలపాక నాగరాజు, గుర్రం నాగేంద్ర బాబు, ముత్యాల మొగిలి, కట్కూరి హరీష్, ఆరెపల్లి వినోద తదితరులు పాల్గొన్నారు.

# భార్యను చంపిన భర్త

- పెళ్లైన మూడు నెలలకే దారుణ హత్య

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ నగరంలో దారుణం చోటుచేసుకుంది. అదనపు కట్నం కోసం పెళ్లయిన మూడు నెలలకే భార్యను భర్త హత్య చేసిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. మృతురాలి తల్లి ఆశు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా వీరారం గ్రామం బాల్యం తండా చెందిన గౌతమి(21) అదే ప్రాంతానికి చెందిన గణేష్(22)తో ఏడాది మే18న వివాహం జరిగింది. వివాహం జరిగిన రెండో రోజు నుంచే గౌతమి అంటే నాకు ఇష్టం లేదు, నాకు ఈ పెళ్లి ఇష్టం లేదని గణేష్ వేధింపులు ప్రారంభించాడు. మరో మహిళతో వివాహేతర సంబంధం కలిగిన గణేష్ అదనపు కట్నం కోసం చిత్రహింసలకు గురిచేశాడు. పెద్ద మనుషుల మధ్య పలుమార్లు పంచాయితీలు జరిగాయి. అయినా అతనిలో మార్పు రాలేదు. కొద్దిరోజుల క్రితం హంటర్ రోడ్డు లోని సాయి నగర్ లో దంపతులు కాపురం పెట్టారు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న గణేష్ భార్య పట్ల ద్వేషం పెంచుకుంటూనే పోయాడు. ఆదివారం రాత్రి భార్య ముఖంపై దిండు పెట్టి శ్వాస ఆడకుండా చేసి దారుణ హత్య చేశాడు. ఏమీ తెలియనట్లు తన భార్య నిద్రపోయి లేవడం లేదని నగరంలోని బంధువులకు సమాచారం ఇచ్చి ఎంజీఎం హాస్పిటల్ కు తరలించాడు. పరీక్షించిన వైద్యులు గౌతమి మరణించిందని ధృవీకరించారు. విషయం తెలుసుకున్న గౌతమి బంధువులు ఆసుపత్రికి చేరేసరికి గణేష్ పరారయ్యాడు. కొంతసేపటికి అతను పోలీసులకు లొంగిపోయాడు. పెళ్లికి ముందే



మరో మహిళతో వివాహేతర సంబంధం కలిగిన గణేష్ అదనపు కట్నం కోసం చిత్రహింసలకు గురి చేశాడని మృతురాలి బంధువులు ఆరోపించారు. రూ.20 లక్షలు, 20 తులాల బంగారం కట్నంగా ఇచ్చి ఘనంగా వివాహం జరిపిస్తే దారుణంగా చంపేశాడని బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. వరంగల్ ఏ ఎస్ పి శుభం ప్రకాష్ సంఘటన స్థలాన్ని సందర్శించి, మార్చురి వద్ద బంధువులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

–సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్

అక్షర దర్బార్, మల్హర్: జయశంకర్ జిల్లా మలహర్రావు మండలంలోని కొయ్యూరు గిరిజన కాలనీని సందర్శించిన సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్, యువైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు అక్కల బాబు యాదవ్ ప్రభుత్వంపై తీవ్ర ఆక్షేపణలు చేశారు. 60 కుటుంబాలు ఉన్నా ఒక్కరికీ ఇల్లు మంజూరుకాకపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని వారు విమర్శించారు. నిరుపేదలైన ఆదివాసి కుటుంబాలకు తక్షణమే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. "మంత్రిగా ఉన్న శ్రీధర్ బాబు వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు సిద్ధం అవుతాం" అని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ భూపాలపల్లి మండల కార్యదర్శి బుర్రి కుమారస్వామి, నాయకులు గొట్టం ఎల్లన్న, సేద మల్లేష్, గొట్టం సమ్మక్క, అరవండి లక్ష్మి , సమ్మయ్య నాయక్ పాల్గొన్నారు.

# రేషన్ డీలర్లకు గౌరవ వేతనం వెంటనే చెల్లించాలి

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : రేషన్ డీలర్లకు ఆరు నెలల గౌరవ వేతనం, కమిషన్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం సమర్పించింది. జిల్లా అధ్యక్షుడు ఎల్లస్వామి గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ₹5,000 గౌరవ వేతనం, ₹300 కమిషన్ పెంపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సెప్టెంబర్ 5న రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌తో పాటు విడతలవారీగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మల భద్రయ్య, మామిడి రమేషు, సుధమల్ల బాలకిషన్, కొత్తపెల్లి పద్మ, రాకల రమేష్ బాబు, నరసయ్య, బొచ్చు లక్ష్మి ప్రభాకర్, మంద నరేష్, దార్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



అక్షర దర్బార్, శాయంపేట : వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు శాయంపేట మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్తి, కంది, వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ప్రత్తి పంటలో టొబాకో స్ట్రీక్ వైరస్ వ్యాప్తికి తామర పురుగులు, పేను బంక కారణమని గుర్తించి, నివారణకు ఇమిడా క్లోపరిడ్ లేదా తయామితాక్సం లేదా ఫిప్రోనిల్ మోతాదును నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కంది పంటలో గొడ్డు మోతు నివారణకు గంధకాన్ని నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా.రాములు, డా.గోనియా నాయక్, డా.పద్మజ, డా.మధు, ఏడీఏ ఎస్.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి గంగా జమున, విస్తరణ అధికారి అర్చన పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శించిన జడ్జీలు



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: విషతుల్యం ఐనటువంటు మంచినీరు తాగి వంద పడకల ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థులను న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి ఏ. నాగరాజ్ మరియు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ సోమవారం పరామర్శించారు. ఆసుపత్రి బెడ్లపై చికిత్సపొందుతున్న చిన్నారులతో మాట్లాడి వారికీ ధైర్యం చెప్పారు. డ్యూటీ డాక్టర్లతో మాట్లాడి పిల్లల యొక్క ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యం మెరుగుపడేలా మంచి చికిత్సను అందించాలని వారికీ సూచించారు. అనంతరం అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు వెళ్లి అక్కడ ఉన్నటువంటి విద్యార్థులకు ధైర్యం చెప్పారు. పాఠశాలలో ఉన్నటువంటి పరిస్థితులను పరిశీలించారు. పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో టోకరా

అక్షరదర్బార్, వెంకటాపురం: సర్కారీ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని వెంకటాపురం పోలీసులు పట్టుకున్నారు. బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అతన్ని ఎస్సై తిరుపతిరావు సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకోగా, అతను తేజావత్ అనిల్ నాయక్ అని తేలింది. 2019లో ఒక మహిళకు ట్రాన్స్కో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి నకిలీ ఐడీలు, ఉత్తర్వులు చూపి మోసం చేశాడు. 2022 మధ్యకాలంలో మరికొందరిని మోసగించి సుమారు ₹72 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నకిలీ ఉత్తర్వులతో మళ్లీ మోసం చేయడానికి వచ్చిన సమయంలో అరెస్టు చేసినట్లు ఏడునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ మీడియాకు తెలిపారు."ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే ప్రకటిస్తారు. వ్యక్తులు లేదా ఏజెన్సీలు హామీ ఇస్తామని చెప్పి డబ్బులు అడిగితే నమ్మొద్దు. ఇలాంటి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలి" అని ఏఎస్పీ హెచ్చరించారు.ఈ ఆపరేషన్‌లో సిఐ ముత్యం రమేష్, ఎస్సై తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.







## వర్ధన్నపేటలో జనహిత యాత్ర

- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్, కాంగ్రెస్ ఇన్చార్జి మీనాక్షి
- అంబేడ్కర్ సెంటర్ వద్ద కార్నర్ మీటింగ్
- హాజరైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

అక్షరదర్బార్, వర్ధన్నపేట: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ చేపట్టిన రెండో విడత జనహిత యాత్ర సోమవారం వరంగల్ జిల్లాకు చేరుకున్నది. కరీంనగర్‌లో సమావేశం ముగిసిన తర్వాత వారు ప్రత్యేక వాహనంలో జిల్లాలోని వర్ధన్నపేట శివారు ఇల్లంద వ్యవసాయ మార్కెట్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి వారు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో కలిసి వర్ధన్నపేటలోని అంబేద్కర్ సెంటర్ వరకు పాదయాత్ర చేపట్టారు. అక్కడ చేపట్టిన కార్నర్ మీటింగ్‌లో మహేశ్‌కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని పేర్కొన్నారు. సామాజిక న్యాయమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. తమ పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. పాదయాత్రలో రాష్ట్ర అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ , టీజీ కో- ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ఛైర్మన్, కాంగ్రెస్ నేత రవీందర్ రావు, కాంగ్రెస్ పార్టీ నేతలు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, దొమ్మటి సాంబయ్య, పిసిసి నేతలు ఝాన్సీ రెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కరీంనగర్ నుంచి వర్ధన్నపేటకు వస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్‌కు వరంగల్ కాకతీయ యూనివర్సిటీ వద్ద వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పార్టీ నేతలు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాస్, కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అలాగే హనుమకొండ హంటర్ సర్కిల్ వద్ద మంత్రి కొండా సురేఖ, కొండా మురళి దంపతులు ఘన స్వాగతం పలికారు. జనహిత పాదయాత్ర కార్నర్ మీటింగ్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టెక్స్ టైల్ పార్క్ నుంచి బస్సు సర్వీస్ ప్రారంభం

అక్షరదర్బార్, వరంగల్: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ (కేఎంటిపి) నుండి వరంగల్ బస్టాండ్ వరకు ఆర్టీసీ బస్సు సేవలను సోమవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద లు జెండా ఊపి ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ – "టెక్స్‌టైల్ పార్క్‌లో పనిచేస్తున్న కార్మికులు, సమీప గ్రామాల ప్రజలకు ఈ సర్వీస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రజా అవసరాల మేరకు మరిన్ని మార్గాల్లో కొత్త బస్సులు నడపడానికి కృషి చేస్తాం" అని అన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ – "పరిశ్రమల అభివృద్ధి కేవలం సంస్థల స్థాపనతో కాదు, కార్మికుల సంక్షేమం, రవాణా సౌకర్యాలపై ఆధారపడి ఉంటుంది. కొత్త ఆర్టీసీ బస్సులు రోజూ ఉదయం, సాయంత్రం వరంగల్–కేఎంటిపి మార్గంలో నడపబడనున్నాయి. దీంతో అనేకమంది కార్మికులు ప్రయోజనం పొందనున్నారు.ఈ కార్యక్రమంలో టిజిఐడిసి జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామినాయక్, డీఎం ధరమ్‌సింగ్ పాల్గొన్నారు.




జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

## ఖననం చేసిన శవానికి పోస్టుమార్టం

అక్షర దర్బార్ మల్హర్: మండలంలోని వల్లెంకుంట గ్రామానికి చెందిన వేల్పుల వెంకటి(46) ఈ నెల 17న మృతి చెందారు. ఈనెల 18న అంత్య క్రియలు నిర్వహించారు. కాగా, వెంకటి గ్రామంలో కూలీ పనికి వెళ్లిన చోట విద్యుత్ షాక్ కు గురైనట్లు గ్రామంలో ప్రచారం సాగడంతో భార్య రాజేశ్వరి భర్త మరణంపై అనుమానం ఉందవి 21న కొయ్యూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. సోమవారం వెంకటిని పూడ్చి పెట్టిన ప్రదేశానికి చేరుకొని శవాన్ని వెలికితీసి తహసీల్దార్ రవికుమార్ సమక్షంలో కేఎంసీ డాక్టర్లు నవీన్ కుమార్, జితేందర్ రీపోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

## ఏసీబీకి చిక్కిన ఏడీఏ

- జీరో దందాపై చర్యలు లేకుండా ఉండేందుకు రూ.25 వేల లంచం డిమాండ్
- సొమ్ము తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కిన అధికారి
- భద్రాద్రి జిల్లాలో ఘటన



అక్షరదర్బార్, భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) రూ.25 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడు సరైన ఇన్వాయిస్ లేకుండా, జీరో ఫారం లేకుండా యూరియా బస్తాలు విక్రయిస్తున్నాడని, దీనిపై చట్టపరమైన లేదా శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా ఉండేందుకు ఏడీఏ నర్సింహారావు రూ. 25,000 లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ముందుగా వేసిన పథకం ప్రకారం, సోమవారం నర్సింహారావు తన కార్యాలయంలోనే ఫిర్యాదుదారుడి నుంచి లంచం డబ్బులు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏడీఏ నుంచి సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. నర్సింహారావును అరెస్టు చేసి, వరంగల్‌లోని ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే, ప్రజలు వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేశారు.

## బెయిల్ కండిషన్లు ఉల్లంఘన

- నిందితుడి అరెస్ట్



అక్షరదర్బార్, హనుమకొండ: సైబర్ నేరానికి పాల్పడి బెయిల్ పై బయటకువచ్చిన నిందితుడు, బెయిల్ నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సైబర్ క్రైమ్ ఏసీపీ గిరికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సంజీత్ కుమార్ సింగ్ అలియాస్ పింటూ సింగ్ మార్చిలో మేకల శ్రీనివాస్ అనే వ్యక్తిని సైబర్ మోసం చేసి రూ.1,68,00,000 కాజేశాడు. తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు వరంగల్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంజీత్ కుమార్ సింగ్ అదుపులోకి తీసుకున్నారు. ఛార్జిషీట్ దాఖలు చేసి, నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ కేసులో కొంతకాలం నిందితుడు జైలు శిక్ష అనుభవించాడు. తర్వాత కోర్టు నుంచి బెయిల్ పొందాడు. బెయిల్ నిబంధన ప్రకారం సంజీత్‌కుమార్ ఈ నెల 19న పోలీసులకు లొంగిపోవాల్సి ఉంది. కానీ, నిందితుడు లొంగిపోలేదు. దీంతో పోలీసులు ఆదివారం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం పరకాల సబ్ జైలుకు తరలించారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915